18వ

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,23 అక్టోబర్ 2024




## నామవారం రెవిన్యూ గ్రామ సభలు హాజరైన కలెక్టర్ ప్రశాంతి



రాజానగరం, మేజర్ న్యూస్ : రెవిన్యూ గ్రామ సభలు నిర్వహించే క్రమంలో సంబంధిత గ్రామాలకు చెందిన రెవిన్యూ రికార్డులతో హాజరు కావాలని , ఫిర్యాదులు చేసే వ్యక్తులు నిర్ధారిత పత్రాలు తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.మంగళవారం రాజానగరం మండలం నామవరం గ్రామంలో రీ సర్వే గ్రామ సభకు కలెక్టర్ హాజరుకావడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి రైతులతో, భూ యజమానులతో ముఖా ముఖీ మాట్లాడుతూ, రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా సర్వే పూర్తి అయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. సంబంధిత గ్రామ సభలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్వహిస్తూ భూ రికార్డులతో హాజరు కావాలని ఆదేశించారు. రీ సర్వే లో తలెత్తిన సమస్యలు పరిష్కారం దిశగా ఈ గ్రామ సభలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో అభ్యంతరాలు పై భూమి వాస్తవ కొలతలకు, డాక్యుమెంట్ ప్రకారం ఉన్న కొలతలు, రీ సర్వే సందర్భంగా ఉన్న కొలతలు ఆధారంగా పరిశీలన చెయ్యడం జరుగుతుందన్నారు. సంబంధిత ఆర్జిదారులు సామూహిక పత్రం (కలెక్టివ్ డాక్యుమెంట్) తో రీ సర్వే గ్రామ సభలకు హాజరు కావాలని, గ్రామ సభలో చూపించాల్సి ఉంటుందని కోరడం జరిగింది. గ్రామ కంఠం భూములుకు చెందిన ఫిర్యాదులు అందచెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజమండ్రీ ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, తహసిల్దార్ ఎన్ లక్ష్మీ లావణ్య, ఎంపిడివో ఝాన్సీ, వి ఆర్ వో లు, రెవెన్యు , పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సక్షం అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులుపై దృష్టి పెట్టాలి

- 15వ ఆర్ధిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలి
- సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సమన్వయ శాఖలు ప్రతిపాదనలు అందజేయాలి
- మరుగుదొడ్ల నిర్మాణం, శుద్ధమైన త్రాగునీటివ్యవస్థ, వాల్ పెయింటింగ్‌లు 45 రోజుల్లో పూర్తి చెయ్యాలి
- కలక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** పిల్లలు,కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపం యొక్క సవాళ్లను పరిష్కరించడానికి సక్షం అంగన్వాడీ మరియు పోషణ్ 2.0 సమీకృత పోషకాహార మద్దతు కార్యక్రమం అమలు,15వ ఆర్థిక సంఘంనిధులతో అంగన్వాడీ కేంద్రాల రూపురేఖలను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో " సక్షం అంగన్వాడీ మరియు పోషణ్ 2.0 -2024-25 " అమలు చేస్తున్న తీరుపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో మెరుగైన వసతుల కల్పన కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ కు సక్షం పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చెయ్యడం జరిగిందన్నారు. 2024-25 సంవత్సరానికి గాను చేపట్టనున్న పనులను అనుసరించి చక్కటి ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఐసిడిఎస్, ఇతర సమన్వయ శాఖలు, ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలోఅందజేసే ప్రతిపాదనలు అందు బాటులో ఉన్న నిధులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఐసిడిఎస్ పిడి కె విజయ కుమారి మాట్లాడుతూ, జిల్లాలో 704 అంగన్వాడీ సొంత భవనాలు ఉండగా , 115 కేంద్రాల్లో మరుగుదొడ్లు,39 త్రాగునీటి వ్యవస్థ ఏర్పాటు చెయ్యాల్సి వుందన్నారు. టాయిలెట్స్, వాల్ పెయింటింగ్, త్రాగునీటి వ్యవస్థ కోసం నిధులను విడుదల చెయ్యడం జరిగిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. వాల్ పెయింటింగ్ అనుబంధంగా చేపట్టాల్సిన పెయింట్ పనుల కోసం రూ.19,800, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం కోసం 36 వేల రూపాయలను, పోషన్ వాటికాస్ కోసం రూ 10 వేలు కేటాయించడం జరిగిందన్నారు. ఆమేరకు నిధులను ఫలవంతం అయ్యేవిధంగా ఐసిడిఎస్, ఇంజనీరింగ్ విభాగాల,డ్వామా,గ్రామ పంచాయతి అధికారులు చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం లో ఉపాధిహామీ పథకం మార్గదర్శకాలని అనుసరించాల్సి ఉంటుందన్నారు. వాటితో పాటు గా విద్యుత్ సరఫరా, త్రాగునీరు సరఫరా తదితర అంశాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఇందుకోసం 45 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీరు సరఫరా కోసం గ్రామ పంచాయతీ ద్వారా పైప్ లైన్లు ద్వారా త్రాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్ వో ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధమైన త్రాగునీటినీ చిన్నారులకు అంద చెయ్యాల్సి ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషన్ వాటికాస్ కాంపోనెంట్ కింద యూనిట్ ఖర్చు 10 వేల రూపాయలతో పచ్చని ఆకు కూరలు (8 రకాలు), ఔషధ మొక్కలు/ పండ్ల చెట్లు (5 లేదా 6 చెట్లు) పెంచాల్సి ఉంటుందనీ కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో సాంకేతికతతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని ఆదేశించారు.ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటడం, వాటి పరిరక్షణ దిశగా తగిన ప్రతిపాదనలతో రావాలని సూచించారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో రైన్ హార్వెస్టింగ్ విధానం ను ఆచరణీయం చేసేలా చొరవ చూపాలని డ్వామా పిడి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్పిడి కే విజయ కుమారి, డ్వామా పీడీ ఆర్. నాగ మల్లేశ్వర రావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ - బివి గిరి,జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, ఏపీఈపిడిసియల్ ఎస్ ఈ-కే.తిలక్‌కుమార్,ఇన్చార్జిడివిపివో ఎమ్.నాగలత, సిడిపివోలు, ఇతర అధికారులు ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లకు ఆకుకూరల విత్తనాలు పంపిణీ



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురం ఐసిడిఎస్ పరిధిలో 47 అంగన్‌వాడీ సెంటర్‌ల ప్రాంగణంలలో ఆకుకూరల పెంపకానికి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని, ఐసిడిఎస్ సిడిపిఓ జి.ఉష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురం ఐసిడిఎస్ పరిధిలో సామర్లకోటలో పది, పెద్దాపురం మండల పరిధిలో 37 అంగన్‌వాడీ సెంటర్ ప్రాంగణంలలో కరివేపాకు, తోటకూర, బొప్పాయి, పాలకూర, మెంతికూర, నిమ్మ, దానిమ్మ, మునగాకు, వంటి ఆకుకూరల పెంపకానికి రూ.10వేల ఒకో అంగన్‌వాడీ సెంటర్‌కు నిధులు మంజూరయ్యాయని, ఆయా అంగన్‌వాడీ సెంటర్‌లలో వీటిని సాగు చేసి పోషకాహారం ఉత్పత్తికి ఉపయోగపడుతుందని సిడిపిఓ తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామ సభ

**- తహశీల్దార్ వెంకటలక్ష్మీ**



**పెద్దాపురం, రూరల్ మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 21వ తేది వరకు నిర్వహించే గ్రామ రెవెన్యూ సభలలో భాగంగా మంగళవారం మండలంలోని సిరివాడ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ రీ సర్వే అనంతరం వచ్చిన సమస్యలను చర్చించి పరిష్కరించడం జరుగుతుందని, వీటిలో ఎల్‌పిఎం, సబ్ డివిజన్, పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరు, ఖాతాలకు మొబైల్ నెంబర్ యాడ్ చేయడం, పట్టాదారు పాస్‌పుస్తకంలో పేరు మార్పు, సవరణలు, వర్గీకరణ, భూమి విస్తీర్ణం, వంటి సమస్యలపై పరిష్కరించడం జరుగుతుందని, కావున భూమి యజమానులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఇనకొండ వీరవిష్ణుచక్రం, బాబులు, మండల సర్వేయర్ సామోరు, వీఆర్వో, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ గ్రామసభలో 8 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ కార్యాలయం తెలిపింది.

## పిఠాపురంలో ఈనెల 25న జాబ్ మేళా





**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో కాకి నాడ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పిఠాపురం నియోజకవర్గంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ నెల 25వ తేదీన " మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు విజయ వర్మ & కో, డైకిన్, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు హాజరుకానున్నాయని ఆయన తెలిపారు. వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి ఎనీ డిగ్రీ, డిప్లొమో పూర్తిచేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులని, ఆ రోజున నిర్వహించే " జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ అవకాశాన్నినిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా... వెబ్ సైట్ నందుతమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి సదరు ' జాబ్ మేళా" కు రెజ్యూమెలతో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో, సిద్ధపడి ఈనెల 25 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వద్దకు రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు, జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ : 86399 51441, 99491 56583 నంబర్లలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కోరారు.

## సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- వైద్యాధికారి నాగార్జున**




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ప్రజలు సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, ఆరోగ్యం పట్ల తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలని జడ్డంగి వైద్యాధికారి జి.నాగార్జున అన్నారు.మండలం లోని జడ్డంగిపి హెచ్ సి పరిధిలోని వెలగలపాలెం 1,2 గ్రామాలలో మంగళవారంఫ్యామిలీ డాక్టర్ వైద్య శిభిరాలు నిర్వహించారు. వైద్యాధికారి నాగార్జున వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 51 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఏ ఎన్ ఎం సీతారత్నం, హెచ్ వి చిన్నయమ్మ,104 డిఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, అంగన్వాడీలు,ఆశ వర్కర్లు సేవలు అందించారు.

## మొబైల్ ఆధార్ సేవలు ప్రారంభం




**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలంలో మొబైల్ ఆధార్ సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 12నుంచి 25వ తేదీవరకు జరిగే మొబైల్ ఆధార్ క్యాంప్‌లో భాగంగా పనసపాడు, అచ్చంపేట గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంప్‌లు ప్రారంభించారు. విద్యార్దులకు, అంగన్వాడి కేంద్రాల పిల్లలకు నూతన అధార్ కార్డ్ లు రిజిస్టర్, పెద్దలకు ఆధార్ అప్డేడెషన్, మొబైల్ లింకింగ్, అడ్రస్స్ మార్పులు వంటి మార్పు చేర్పులకు ఈ ఆధార్ క్యాంప్ లు నిర్వహిస్తున్నట్టు ఎంపిడివో కె హిమ మహేశ్వరీ చెప్పారు. అయితే పనసపాడు, అచ్చంపేట గ్రామాలతో పాటు పిబి దేవం గ్రామంలో నూ ఆధార్ క్యాంప్ జరగాల్సి ఉండగా ఆధార్ కిట్ లు అందుబాటులో లేనందున పిబి దేవంలో క్యాంప్ రద్దు చేసినట్టు ఆమె చెప్పారు. కాగా రెండు గ్రామాల్లో నిర్వహించిన ఆధార్ క్యాంపుల్లో విద్యార్థులు, ప్రజలు సేవలను వినియోగించు కున్నారు.

## ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం స్కూల్ పిల్లలకు పోలీస్ స్టేషన్లో వైర్ లెస్ కమ్యూనికేషన్ నిమిత్తం ఉపయోగించే విహెచ్ఎఫ్ సెట్ ను ఎలా ఉపయోగిస్తారో పిల్లలకు వివరించడం జరిగింది. అంతేకాకుండా దానిని ఉపయోగించే విధానాన్ని స్వయంగా వాళ్లతోనే మాట్లాడించటం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో ఒక మెసేజ్ ను అన్ని పోలీస్ స్టేషన్లకు ఏ విధంగా ఈ విహెచ్ఎఫ్ సెట్ ద్వారా ఎలా కమ్యూనికేట్ చేస్తారో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం గ్రామంలోని డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన ధవళేశ్వరం పోలీస్



**ధవళేశ్వరం,మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల వాడపేట, జాలర్ పేట, కొత్తపేట ప్రాంతాలలో అక్టోబర్ 22వ తేదీ మంగళవారం విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించటం జరిగింది.

దీనిలో భాగంగా మెయిన్ రోడ్డుకి ఆనుకుని ఉన్న దుకాణ దారులకు ట్రాఫిక్ రూల్స్ మీద అవగాహన కల్పించడం జరిగింది.అలాగే క్రైమ్ జరిగే ఏరియాలలోనూ మరియు నిర్మానుష్య ప్రదేశాలలో మద్యం తాగుతూ తున్న కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు బుక్ చేయడం కూడా జరిగింది.

ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం సిఐతో పాటు ఎస్సై క్రాంతికుమార్ మరియు ఏఎస్ఐ లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్వర ప్రజా సమస్యల పరిష్కారం కొరకు, "ప్రజా దర్బార్" ఏర్పాటు



**- రాజమహేంద్రవరం శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేదనే ఉద్దేశంతో ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా " ప్రజా దర్బార్ " వినూత్న కార్యక్రమం చెప్పటటం జరిగిందని రాజమహేంద్రవరం శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు)అన్నారు.మంగళవారం ఉదయం సోమాలమ్మ గుడి,కొత్తపేటవద్ద 6,21,22,23,24,25,29,30,31,32,33 వార్డుల ప్రజలు వారి సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధులకు తెలియ చేసుకునేందుకుగాను వేదికగా ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల సత్వర పరిష్కార నిమిత్తంకార్యక్రమం నిర్వహించడం జరిగిందని శాసనసభ్యులు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ప్రజలు ఎవ్వరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుటకు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరగనవసరం లేదని ఆయన అన్నారు. అర్హత ఉన్న ప్రతిలబ్ధిదారుడు ప్రభుత్వపథకాలను అందిపుచ్చుకోవటం వారి హక్కుగా భావించాలని, వ్యయ ప్రయాసలకోర్చి ఎవరి చుట్టూ తిరగకూడదు అనే దృఢ సంకల్పంతోవారు సులువుగా సంక్షేమ పథకాలను అందిపుచ్చుకునే తమకూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో వ్యవహరించి చట్టబద్ధతలేని హామీ పత్రాలను లబ్ధిదారులకు ఇవ్వటం జరిగిందని ఇందువలన అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆయన అన్నారు.ఎన్నికలలోఇచ్చిన హామీ మేరకు పండుగ సందర్భంగా ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ను పంపిణీ చేసే కార్యక్రమం చేపడతామని ఆయన అన్నారు. త్వరలోనే ఉచిత ఇసుకను లబ్ధిదారులకు పంపిణీ దిశగా తాము చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. తమ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే చెత్త పన్ను రద్దు, అన్నా కాంటీన్‌ల ప్రారంభం వంటి కార్యక్రమంచే పట్టటం జరిగిందని ఆయనఅన్నారు. తమ సమస్యలను నేరుగా తన దృష్టికితీసుకువచ్చిఅర్జీలను సమర్పించ వలసిందిగా ఆయనకోరారు.తద్వారా అట్టి దరఖాస్తులను సంబంధిత వార్డుల వారికి పంపి సంబంధిత శాఖల వారిచే సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ నిబంధనాల మేరకు సంక్షేమ ఫలాలను పొందే విధంగా చర్యలు చేపడతామని ఆయన అన్నారు.అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలను పొందలేని వితంతు వృద్ధాప్య, ఇండ్ల స్థలాలు, మరి ఏఇతర స్థానిక సమస్యలు ఉన్నప్పటికీ లబ్ధిదారులు ఈ ప్రజా దర్బార్ వేదిక నందు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు.ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ అజెండాగా పనిచేస్తున్నామని, ఇందుకు ఎటువంటి ఆర్థిక పరమైన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ప్రజా దర్బార్ వేదికలో వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ కార్పొరేషన్ మరియు సచివాలయ అధికారులకు పంపి అర్హులను గుర్తించి వారికి తగు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ప్రజా వేదిక లో ఇంకేమైనా స్థానిక సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ప్రజా దర్బార్ వేదికలో 9వ వార్డుకు చెందిన సిహెచ్ సూర్యవతి భర్త చనిపోయి ఆరు సంవత్సరాలు గడిచినప్పటికీ తనకు ఎటువంటి పెన్షన్ మంజూరు కాలేదని, తనకు వితంతు పెన్షన్ ఇప్పించవలసిందిగా శాసనసభ్యునికి దరఖాస్తు చేసుకున్నారు. కొత్తపేట 29వ వార్డుకు చెందిన పి.లక్ష్మి తన భర్త గురుమూర్తి చనిపోయినప్పటికీ తనకు పింఛను మంజూరు కాలేదని తనకువెంటనే పింఛను మంజూరు చేయవలసిందిగా శాసనసభ్యునికి దరఖాస్తు చేసుకున్నారు.

24వ వార్డుకు చెందిన డిసూర్యవతి వితంతుపించనుమంజూరు చేయవలసిందిగా ప్రజా దర్బార్ వేదిక ద్వారా శాసనసభ్యునికి దరఖాస్తు సమర్పించుకొని ఉన్నారు. "ప్రజా దర్బార్" ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి కాశీ నవీన్, సిటీ జనరల్ సెక్రెటరీ బి. రాధా, 6 వ వార్డ్ ఇంచార్జి యం. రాంబాబు, 21 వ వార్డ్ ఇంచార్జి ఎన్. శ్రీను, 22 వ వార్డ్ ఇంచార్జి ఎస్. జగదీశ్, 23వ వార్డ్ ఇంచార్జి వై.దీప్, 24వ వార్డ్ ఇంచార్జి కె. కాశీ, వి.స్వామి, 29 వ వార్డ్ ఇంచార్జి ఆర్ విజయ్, 30వ వార్డ్ ఇంచార్జి ఆర్ మని, 33 వ వార్డ్ ఇంచార్జి బి.శ్యాం, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయండి



**- సిపిఐ (యమ్.యల్) లిబరేషన్**

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** బిజెపి-ఎన్.డి.ఏ కూటమి కొనసాగిస్తున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా, సిపిఐ(యమ్.యల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 4వ తేదీన విజయవాడలో జరిగే "ప్రజా హక్కుల ర్యాలీ"ని జయప్రదం చేయాలని జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ సమావేశం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఏగుపాటి అర్జునరావు అధ్యక్షతన ఏలేశ్వరంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ శంకర్, రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన "సూపర్ సిక్స్" హామీలులో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని, హామీలను అమలు చేయకుండా ప్రజల ఆలోచనలను ప్రక్కదారి మళ్లించడానికి ఎన్.డి.ఏ భాగస్వామైన జనసేనతో కలసి ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే సనాతన ధర్మం, లడ్డు వ్యవహారం లాంటి గందరగోళం పరిస్థితులను సృష్టించిందని ఆరోపించారు.

ఉచిత గ్యాస్ పథకం, మహిళలకు ఉచిత బస్సు, ఇల్లు నిర్మించుకున్న వారికి నాలుగు లక్షలు రుణం, మూడు సెంట్లు ఇళ్లస్థలం, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు లాంటి వివిధ పథకాలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి తప్ప ఏ ఒక్కటీ అమలు కాలేదని, కేవలం పెన్షన్లు మాత్రమే ఇస్తూ మిగతా సూపర్ సిక్స్ పథకాలు అమలుకాకుండా ప్రజలతో మైండ్ గేమ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజా హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 4 తేదీన విజయవాడలో జరిగే "ప్రజా హక్కుల ర్యాలీ"లో జిల్లా నలుమూలల నుండి ప్రజాస్వామిక వాదులు, సానుబూతిపరులు, కార్మికులు ప్రజలంతా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నలుమూలు, మండలాల నుండి పార్టీ కార్యకర్తలు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్టేజ్-2 వెరిఫికేషన్ ప్రారంభం



కాకినాడ, మేజర్ న్యూస్ : చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో నమోదు చేసుకున్న చేతి వృత్తి లబ్ధిదారులను జిల్లా స్థాయిలో అప్రూవల్ చేయు నిమిత్తం స్టేజ్-2 వెరిఫికేషన్ కార్యక్రమం కాకినాడ నగరంలో ప్రారంభమైంది. దీనికి సంబంధించిన నోడల్ ఆఫీసర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు బృందాలుగా ఏర్పాటై సోమ, మంగళవారాల్లో ఈ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం ఈ వెరిఫికేషన్ నివేదికను జిల్లా కలెక్టరేట్‌లో అందజేయనున్నారు. కమిషనర్ భావన ఆదేశాలతో సర్కిల్ స్పెషలాఫీసర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి కమిషనర్ భావన ఇటీవల అధికారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను చేపట్టాలని సూచించారు.

# ఆదిత్య యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక



గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెంలో గల ఆదిత్య విశ్వ విద్యాలయం లో 2024 కి సంబంధించి కబడ్డీ టీమ్ సెలెక్షన్స్ ని డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా. ఎమ్. శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సెలక్షన్ ట్రైల్స్‌లో పాల్గొని ఆదిత్య యూనివర్సిటీ టీమ్‌కి ఎంపికైన క్రీడాకారులను యూనివర్సిటీ యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా. ఎమ్. శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సెలర్ డా. ఎస్. రమశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి. సత్యనారాయణ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. త్రిపాఠి,అలాగే ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ అధిపతి డా. ఎన్ రవి పాల్గొనటం జరిగింది.

# నూరుశాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు కృషి

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరు శాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. చిన్నారుల భద్రతా, సంరక్షణ, లైంగిక వేధింపులకు గురవకుండా చిన్నారులను కాపాడుకోవడం వంటి అంశాలపై కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావనా, అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో నిత్యం చిన్నారులు ఏదో ఒకరకంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారు. చిన్న వయసులో జరిగే లైంగిక వేధింపుల నుంచి మన పిల్లలను కాపాడుకోవడానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరు శాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. చిన్నపిల్లల పట్ల ప్రవర్తించాల్సిన తీరుపై సరైన అవగాహన లేకపోవడం వలన మన చుట్టుపక్కల ప్రాంతాల్లోని చిన్నారులు తరుచుగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరు పిల్లలేనని, 97 శాతం అందరూ తెలిసిన వారి నుంచే పిల్లలు తరచుగా లైంగిక వేధింపుల బారిన పడుతున్నారన్నారు. పిల్లలతో కలిసి పని చేసే ప్రభుత్వ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో తల్లిదండ్రులతో పాటు చిన్నారులకు సురక్షితమైన స్పర్శ, చెడు స్పర్శ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులను లైంగిక వేధింపుల భారీ నుంచి కాపాడేందుకు జిల్లాలో విద్య జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డ్రామా, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా హెల్ప్ లైన్ నెంబర్ ఒకటి ఏర్పాటు చేసి పిల్లలపై వేధింపుల విషయంలో వచ్చే సమస్యలు స్వయంగా పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధర్యంలో, జిల్లా స్థాయి అధికారుల సహాయంతో పరిష్కరించే దిశగా ఆలోచిస్తున్నామని ఆయన వివరించారు.

పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్య ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులలో భౌతికంగా వారి శరీరంలో కలిగే మార్పులు, భావోద్వేగాలు, నిర్లక్ష్యం వంటి కారణాలతో లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. తరచుగా చిన్నారులు లైంగిక వేధింపులకు గురికావడాని గల కారణాలు, చిన్నారులకు రక్షణ కల్పిస్తూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన వివిధ చట్టాలకు సంబంధించి ఎన్సీపీఆర్, పోక్సో చట్టాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల పరిష్కార మార్గంలో భాగంగా మండల స్థాయిలో బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు వేసి, తద్వారా ట్రెయిన్సర్స్‌ని తయారు చేసి ప్రతీ స్కూల్, హాస్టల్, గ్రామం లో అవగాహనా తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈవర్క్‌షాప్‌లో జేడ్పీసీఈవో వి.వి.వి.ఎస్.లక్ష్మణ రావు, ఇంచార్జ్ డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఈవో పీ.రమేశ్, సీపీవో పీ.త్రినాథ్, డీపీవో వి.రవికూమార్, ఇతర వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం



కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పులపకూర సునీత ఆత్మహత్యయత్నం చేసింది. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను కాకినాడ జిజిహెచ్ లో చికిత్స కు త్సరలించారు. జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళీ, గ్రామ అధ్యక్షుడు గంటా నానీ, వీర మహిళ భవానీతోపాటు పలువురు జనసైనికులు తమను కులం పేరుతో తిడుతున్నారని, పనికి హాజరు కానివారికి మస్తర్లు వేసి ఆ జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సునీత కుటుంబ సభ్యులు ఆరోపించారు. శారీరకంగా వేధిస్తున్నారంటూ తరచూ తన భార్య తనకు చెప్పేదని బాధితురాలి భర్త వీరబాబు తెలిపారు. తప్పు చేస్తే విచారణ జరపాలని, ఎలాంటి విచారణ జరుపకుండా ఉద్యోగం నుంచి తీసేసారని ఆరోపించాడు. అవమానాభారంతో మనస్థాపానికి గురైన తన భార్య నిద్ర మాత్రలు, టైల్స్ అతికించేందుకు వినియోగించే గమ్ మింగి ఆత్మహత్య యత్నం చేసిందని ఆయన తెలిపారు. వాంతులు చేసుకోవడంతో గమనించి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించామన్నాడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేసి తన భార్యను ఆత్మహత్యయత్నానికి ఉసి గొల్పినవారిపై చర్యలు తీసికోవాలని అతను వేడుకుంటున్నాడు.

# లిక్కర్ ఫ్యాక్టరీలో సిఐడి సోదాలు



అనపర్తి, మేజర్ న్యూస్ : మండలంలోని, కొప్పవరం శివారులో ఉన్న డిటిహెచ్ ఆల్ట్రో ఎంటర్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో సిఐడి డి.ఎస్.పి భూపాల్ ఆధ్వర్యంలో సిఐడి, ఎక్స్ఛేంజ్ శాఖ అధికారులు కలిసి సోదాలు నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో గడిచిన ఐదు సంవత్సరాలలో లిక్కర్ వ్యవహారంలో అనేక అవినీతి జరిగిందనే ఆరోపణపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. అందులో భాగంగానే రాష్ట్రంలో అనేక లిక్కర్ ఫ్యాక్టరీలలో సిఐడి సోదాలు జరుగుతున్నాయి. గత ఐదు సంవత్సరముల నుండి జరిగిన లావాదేవీలు, ఫ్యాక్టరీ లైసెన్స్, మద్యం నాణ్యత తదితర అంశాలపై మంగళవారం సిఐడి, ఎక్సేంజ్ శాఖ అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని రంగంపేట మండలం, కోటపాడు గ్రామంలో ఉన్నటువంటి లిక్కర్ ఫ్యాక్టరీలో కూడా సిఐడి అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రధానంగా గత ఐదు సంవత్సరముల నుండి జరిపిన వ్యవహారంలో అవినీతి జరిగిందా అన్న అంశంపై విచారణ కొనసాగుతోంది. అవినీతి జరిగినట్లయితే ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఫ్యాక్టరీలో ఉదయం నుండి తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. అవినీతికి సంబంధించిన ఆధారాలు ఏమైన లభించాయా లేదా అన్న విషయాలు కూడా వెల్లడించలేదు.

# ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా



– 50 నూతన బెడ్లను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి శుభాష్

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి సిఎస్ఆర్ నిధుల ద్వారా 50 నూతన బెడ్లు అందించడం జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ తెలిపారు. మంగళవారం మంత్రి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో వైరల్ జ్వరాలు సంభవిస్తున్నాయని 12 సంవత్సరాల లోపు చిన్న పిల్లలు ఎక్కువగా జ్వరాలు బారిన పడి ఆసుపత్రులకు వస్తున్నారన్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రి అయినప్పటికీ ఆసుపత్రిలో 70 బెడ్లు మాత్రమే ఉన్నాయని అవి కూడా పాడైపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కానీ జ్వరాలు బారినబడిన రోగులు ఎక్కువమంది ఆసుపత్రికి వస్తుండడంతో బెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో సిఎస్ఆర్ నిధుల ద్వారా ఆసుపత్రికి 50 నూతన బెడ్లను సమకూర్చడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు. వైద్యులు, సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికులు తమ విధులు చక్కగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి భవిష్యత్తులో కూడా అవసరమైన సౌకర్యాలని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కంచమర్తి బాబురావు, గౌరీ శంకర్, నందూరి ఫణి కుమార్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** విధుల నిర్వహణలో నిబద్ధత కలిగి, ఉత్తమ ప్రతిభను కనబరిచి, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ సహచర ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా నిలవడం అభినందనీయమని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్ అన్నారు. మంగళవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో కార్యాలయం వద్ద ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెల లలో, మరియు దసరా సమయంలో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరిచి సంస్థకు అధికఆదాయాన్ని కల్పించడంలో నిబద్ధతతో పనిచేసిన ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తను చేసే వృత్తిపట్ల ఇష్టాన్ని పెంచుకోవాలని, ఇష్టంతో చేసే ఏ పని అయినా అది కష్టం కాదు అని అన్నారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను అభినందించడం అందరి బాధ్యత అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగిలిన ఉద్యోగులు తమ విధులకు న్యాయం చేయాలని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో గ్యారేజ్ సూపర్వైజర్ సునయన, సూర్యచంద్రం, రెడ్డి, డిపో మరియు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటా మధ్వ మత ప్రచారం



కాకినాడ, మేజర్ న్యూస్ : డి.ముప్పవరం గ్రామంలో ఉత్తరాధిమఠాధీశులు సత్యాత్మ తీర్థ స్వామిజీ ఆదేశానుసారం రాజమండ్రి ఉత్తరాది మఠం శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా మధ్వ మత ప్రచారం కార్యక్రమం మూలరామ మరియు గురువుల చిత్రపటాల ముందు పుష్ప సమర్పణచేసి సుధా పండితులు విజయ సింహాచార్ ఘనంగా ప్రారంభించారు. తొలిత ఆ గ్రామంలో ఉన్నటువంటి ఉత్తరాధిమఠ పరంపరలో వచ్చినశ్రీ సత్యసంధ స్వాముల వారిచే ప్రతిష్టించబడిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని దర్శించుకుని అక్కడ స్వామిని విజయ సింహాచార్ సేవించుకుని ఇంటింటా మధ్వ మత ప్రచారం కార్యక్రమం ప్రారంభం చేస్తున్నట్లు అక్కడ విజయ సింహాచార్ ప్రకటించారు. అనంతరం డి.ముప్పవరం గ్రామ వాస్తవ్యులు ద్రోణంరాజు రామారావు స్వగృహంలో విజయ సింహాచార్ ప్రవచనంలో మధ్వ మతం గొప్పతనం, మధ్వాచార్యులు వారి గురించి, అలాగే మన మత పరంపరలో ఉన్న యతీశ్వరులు గురించి వివరించారు. వాదిరాజ స్వామివారుచే రచించబడిన హయగ్రీవ సంపద స్తోత్రం అందరికీ వివరించి అందరి చేత సామూహికంగా చదివించారు. వారందరినీ ఈ స్తోత్రాన్ని ప్రతినిత్యం చదవడం వల్ల పిల్లలకు, చదువుకునే విద్యార్థులకి మంచి భవిష్యతు వుంటుందన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను అవగాహన చేసుకుని ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా గృహస్తులు పఠించడం వల్ల సంపదను పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సారంగ ఆదిత్య, పవన్, కందాళం నరసింహారావు, చట్టి హనుమంతరావు, రాచూరి కళ్యాణి చక్రవర్తి, చిల్లరగి వెంకట అన్నాజీరావు,చట్టి వాసుదేవరావుతో పాటు పలుప్రాంతాలకు చెందిన మాధ్వగ్రహస్తులు పాల్గొన్నారు. ద్రోణం రాజు రామారావు దంపతులు స్వామి ప్రసాదం వితరణ చేశారు.

# సెల్‌టవర్ నిర్మాణం ఆపాలంటూ ఆందోళన



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** స్థానిక లింగంపర్తి రోడ్డు వెంకట్ నగర్ కాలనీలో సెల్ టవర్ నిర్మాణం చేపడుతున్నారంటూ కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రభుత్వం వారు చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు అనుమతి తీసుకోకుండా సెల్ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం ఎలా అనుమతించిందని వారు అన్నారు. అంతేకాకుండా సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ పెరిగి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని, ఇప్పటికే పిచికలు,కాకులు వంటి అనేక రకాల జీవులు చాలావరకు రేడియేషన్ ఎక్కువ అవ్వడంతో నశించిపోయాయని వారన్నారు. సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే ఆపకపోతే కాలనీవాసులు అంతా కలిసి తమ ఆందోళన ఉధృత చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు భూపతి సత్యనారాయణ,జేవీఎస్ నారాయణ,పాపారావు, పులిమంతుల ఆనందరావు, సత్యనారాయణ,మారిశెట్టి వరలక్ష్మి,లోవ రాజు,భూపతి నాగరత్నం రాజు,పెంటకోట సత్తిబాబు,ఎస్ రాజబాబు,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ‘ట్రెజర్ హంట్’ పోస్టరు ఆవిష్కరణ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రాణాంతక వ్యాధిగ్రస్త చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో కాకినాడ లయన్స్ క్లబ్ సంకల్ప్ “ట్రెజర్ హంట్” పేరుతో నిధుల సేకరణ కోసం ఈ నెల 27న ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించి మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ట్రెజర్ హంట్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం అందజేయడం ద్వారా చిన్నారుల ఆయుర్దాయం, ఆరోగ్యం పెంచేందుకు అవసరమైన నిధులను సేకరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తమని జిల్లా కలెక్టర్ అన్నారు. కాకినాడ లయన్స్ క్లబ్ సంకల్ప్ తరపున కృషి చేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ లావణ్య సమయమంత్రి, స్వాతి కిషోర్, పెద్ది అనిత, మోనికా రేవంత్ మరియు శ్రీదేవి సాగి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై అత్యాచారాలకు,వివక్షతకు, దాడులకు,వ్యతిరేకంగా పోరాడుదాం

**– నవంబర్ 1నుండి 5వ తేదీలలో రౌండ్ టేబుల్ సమావేశాలు విజయవంతం చేయండి**

**– ప్రగతి నారి సంఘము(పి.ఎన్.ఎస్.) ఆంధ్రప్రదేశ్ కమిటీ పిలుపు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ పార్టీ ఆఫీసు నందు పి.ఎన్.ఎస్. ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్ర ఆవిష్కరణ జరిగింది. మహిళలపై అత్యాచారాలకు, వివక్షతకు, దాడులకు, వ్యతిరేకంగా పోరాడుదాం, నవంబర్ 1 నుండి 5వ తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు విజయవంతం చేయాలి అని ప్రగతి నారి సంఘము పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి.మంగాదేవి, అధ్యక్షురాలు బి.పద్మ, కాకినాడ నగర కార్యదర్శి పి.వరలక్ష్మి, కమిటీ సభ్యులు పి.వెంకటలక్ష్మి, జె.విజయ గౌరీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఇంచార్జ్ ఎం.నాగమణి హాజరు కావడం జరిగింది.

# ఉన్నత ఆదర్శ విలువలు కలిగిన గొప్ప మానవతావాది ఎస్.ఆర్.శంకరన్

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



కాకినాడ, మేజర్ న్యూస్ : దేశ చరిత్రలో ఉన్న ఐఏఎస్ అధికారులలో ఉన్నత ఆదర్శ విలువలు కలిగిన గొప్ప మానవతావాది ఎస్.ఆర్.శంకరన్ అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్.ఆర్.శంకరన్ (సిరిగరత్తూర్ రామనాథన్ శంకరన్) 90వ జయంతిని పురస్కరించుకుని కాకినాడ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భవనా, జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ.రామారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ దేశంలో గుర్తుపెట్టుకునే ఉత్తమ ఐఏఎస్ అధికారులలో ఎస్.ఆర్.శంకరన్ ఒకరని అన్నారు. ఆయనను గుర్తు చేసుకుంటూ నేటికీ ఘనంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నాం అంటే ఆయనకున్న ప్రాముఖ్యత,ఆయన చేసిన సేవలే కారణమన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటు పడ్డారన్నారు. ప్రతిఒక్కరు ఆయన జీవిత విధానాన్ని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావనా మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ జీవితాంతం ప్రజలకు నిబద్ధులై ఉండే అరుదైన అధికారుల్లో ఎస్ఆర్ శంకరన్ ప్రథమ స్థానంలో ఉంటారన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి రామారావు మాట్లాడుతూ ఆయన బతికినంత కాలం దళిత, గిరిజన, ఆదివాసీ అట్టాడుగు వర్గాల కోసం ప్రత్యేకంగా పనిచేసి వారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. అంటారనితనం రూపుమాపడానికి ఆయన కృషి ఎంతో ఉందని, పేదవర్గాలకు ఇళ్ల స్థలాలు, భూములు పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని దళిత వేత్త రామేశ్వరావు అన్నారు. బడుగు జీవుల ఆత్మ గౌరవ కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, పదవి విరమణ అనంతరం పౌర సమాజం కోసం అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుడు ఎస్ఆర్ శంకరన్ అని సామాజిక హక్కుల వేదిక చైర్మన్ తాటిపాక మధు కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది, ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సత్యమార్గంలో జీవించాలి -చైర్పర్సన్ ఆలమండ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ రాగద్వేషాలకు దూరంగా సత్యమార్గంలో జీవించాలని నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య సూచించారు. మంగళవారం ఏలేశ్వరం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో సత్య దీక్ష వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాగద్వేషాలకు దూరంగా సత్యమార్గంలో ప్రశాంతంగా జీవించాలని ఆయన సూచించారు. అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయానికి అనుసంధాన మైన ఏలేశ్వరం దేవస్థానంలో భక్తులను ప్రోత్సహించేందుకు ఆలయ ధర్మకర్త ఐవి రోహిత్, ఈ వో రామ్మోహన్ ఆదేశాల మేరకు ధర్మ ప్రచారక్ గిడుతూరి కృష్ణ బాబు భక్తులను ప్రోత్సహించే దిశగా సత్యదేవ దీక్షలను ప్రచారం చేపట్టారన్నారు. దీనిలో భాగంగా ఏలేశ్వరం సత్యదేవ భక్తులకు దీక్షకు సంబంధించిన వస్త్రాలను, మాలలు తదితర వస్తువులను అందజేస్తున్నారన్నారు. అన్నవరం దేవస్థానం అందించే ఈ ప్రోత్సాహాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పొన్నూరి వెంకటరమణాచార్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పొన్నాడ కుటుంబానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి జ్యోతులశ్రీనివాస్ ఆర్థిక సహకారం



గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో మంగళవారం బీసీ కాలనీలో నివాస ముంటున్న పొన్నాడ నాగమణి అకాల మరణానికి చింతిస్తూ ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తూ జనసేన పార్టీ తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు ఆ కుటుంబానికి ఆర్థిక విరాళం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులైన పొన్నాడ ఆదివిష్ణు, వేణమ్మకు ధైర్యం చెప్పి నేనున్నానంటూ ఆ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పొన్నాడ నాగమణి మరణం బీమాకు సంబంధించిన విషయాలు జనసేన పార్టీ తరపున బీమా సహకారం అందుతుందని ఆ కుటుంబానికి జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు తెలియపరిచారు. మృతురాలికి మిగిలిన కర్మకాండ, పెద్దకర్మ కార్యక్రమాలకు జ్యోతుల ఆర్థిక సహకారం అందించి ఆ పేద కుటుంబాన్ని ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దుర్గాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ చైర్మన్ కంద శ్రీనివాస్, మొగలి శ్రీను, జ్యోతుల సీత రాంబాబు, పొలం త్రిమూర్తులు, మంతెన గణేష్, కోలా శివ, సకినాల లచ్చుబాబు, సాయి ప్రియ సేవాసమితి జిల్లా కార్యదర్శి మేకల కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గోదావరిలో గల్లంతైన బాలుని మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని నార్కేడిమిల్లి శివారు నార్కేడిమిల్లిపాలెం వద్ద ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి బాలుడు గల్లంతయ్యాడు. గ్రామనికి చెందిన 13 ఏళ్ళ పిల్లి అభిషేక్ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వశిష్ట గోదావరిలో 11 మంది స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు వెళ్ళాడు. ఆ సమయంలో పిల్లి అభిషేక్ గోదావరి నదిలోకి మునిగిపోయి కనిపించకుండా గల్లంతు అయ్యాడు. గ్రామస్తులు బాలుడు ఆచూకీ కోసం రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం బాలుడి మృతదేహం లభ్యం అయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

## టెలికాం వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- తూర్పు గోదావరి టెలికాం డిస్ట్రిక్ట్ అడ్వైజరీ కమిటీ మెంబర్ సత్యనారాయణ**
**- తన నియామకానికి ప్రతిపాదించిన డిప్యూటీ సిఎం పవన్, ఎంపి ఉదయ్ శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి టెలికాం డిస్ట్రిక్ట్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ఎం.ఎస్.ఆర్.వి. సత్యనారాయణ నియమించబడ్డారు. సత్యనారాయణ మాట్లాడుతూ, టెలికాం వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి స్థానిక అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని, తనమీద నమ్మకంతో ఈ నియామకానికి ప్రతిపాదించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, కాకినాడ ఎంపీ తంగిరాల ఉదయ్ శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలియచేసారు.

# అంగరంగ వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు









**- హంస వాహనంపై విహరించిన కోనేటి రాయుడు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కలియుగ దైవం వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు హంసవాహనంపై కోనేటి రాయుడు సరస్వతి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం స్వామివారికి పండితులు ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్త కళశారాధన, మహాస్నపనము, వసంతోత్సవము, అష్టదళ పాదపద్మారాధన, ప్రధాన హెూమములు, నీరాజన మంత్రపుష్పములు, సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హెూమములు, హనుమత్ మూలమంత్ర హవనము, అష్టోత్తర కళశారాధన, పంచశయ్యాది వాసము, దిగ్ దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి సరస్వతీ అలంకరణతో హంస వాహన సేవ తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళతాళాలు, విద్యుత్ దీపాలంకరణలు అందరినీ అలరించాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చి కార్యక్రమాల్ని తిలకించి పులకించారు, స్వామివారికి పట్టు వస్త్రాలను డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్‌రావు, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, లోల్ల సర్పంచ్ కాయల జగన్నాథం దంపతులు అందజేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో భద్రాచలం రాములవారు.కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు భద్రాచలం రాములవారి విగ్రహాలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని తిలకించి పులకించారు. ఈ సందర్భంగా పరిసరాలన్నీ శ్రీరామ స్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## భూసమస్యల పరిష్కారము కొరకు రీసర్వే గ్రామ సభ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం ఉండూరు గ్రామములో ఉండూరు-1 సచివాలయములో తహశీల్దార్ కె. చంద్ర శేఖర రెడ్డి నేతృత్వంలో రీసర్వే అనంతర భూసమస్యల పరిష్కారము కొరకు రీసర్వే గ్రామ సభ మంగళవారం విజయవంతముగా జరిగింది. ఈ గ్రామ సభలో భూయజమానులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, మరియు అన్ని పార్టీల నాయకులు పాల్గొని రీసర్వే అనంతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తహశీల్దార్ ఆ సమస్యలపై వివరంగా చర్చించి పరిష్కారాలను సూచించడం జరిగింది. గ్రామ సభలో వచ్చిన మొత్తము అర్జీలు : 27. వాటి వివరములు. తన పొరుగువారితో కలిపి జాయింట్ ఎల్‌పిఎం జనరేట్ అయిన కారణముగా విడి విడిగా సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాసు మంజూరు చెయ్యమని కోరిన అర్జీలు : 02

తన ఖాతాకు మొబైల్ నంబర్ టాగ్ చెయ్యమని కొరినవి : 03

పట్టాదారు పాసుపుస్తకములో పేరు మార్పు కొరకు : 02

పట్టాదారు పాసుపుస్తకములో సవరణల కొరకు : 01

రెండు ఖాతాలతో పాసుపుస్తకములు వచ్చినందున మెర్జ్ చెయ్యమని వచ్చిన అర్జీలు : 01

భూమి క్లాసిఫికేషన్ (వర్గీకరణ) తప్పుగా పడినవి : 01

గతములో ఉన్న భూమి విస్తీర్ణం కన్నా రీ సర్వే తరువాత విస్తీర్ణం తగ్గినదని వచ్చిన అర్జీలు : 17 ఈ కార్యక్రమములో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు- సిహెచ్. నర్సింహమూర్తి, ఏ.సంజీవ్ భరత్, టి.సాయిరాం మరియు గ్రామ రెవిన్యూ అధికారులు కె.చంద్రబాబు, ఆర్.కొండలరావు పాల్గొన్నారు.

## బస్సులు కొరతతో విద్యార్థులు ఇలా అయితే ప్రమాదమే...



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఆర్టీసి బస్సులకు ప్రతిరోజూ ఇదే తంటా... కళాశాల ల సమయంలో డ్రైవర్ లు, కండక్టర్ లు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం 7 గంటలు మొదలు పది గంటలు దాటే వరకు విద్యార్థులు ఇలా ఫీట్లు కొడుతున్నారు. ఎలాగైనా కళాశాలలకు సమయానికి చేరుకోవాలనే ఆత్రుతతో బస్సులు ఖాళీ లేకున్నా ఇలా ఫుట్ పాత్ పై వ్రేలాడుతూ ప్రయాణాలను సాగిస్తున్నారు. సామర్లకోట ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిత్యం ఇలాంటి దృశ్యాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఒకప్రక్క ట్రాఫిక్ పోలీసులు ఎంత హెచ్చరిస్తున్నా విద్యార్థులు వినిపించుకోవడం లేదు. సరిగ్గా బస్సులు కదులుతున్న సమయం చూసి ఒక్కసారిగా పదుల సంఖ్యలో విద్యార్థులు ఇలా వ్రేలాడుతూ వెళుతుండటంతో చూసేవారికి గుండె ఆగినంత పానవుతుంది. అసలే ట్రాఫిక్ ఇబ్బందులు అధికమైన క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు ఇలాంటి బస్సులకు దగ్గరగా వస్తే పరిస్థితి ఏమిటని ఊహిస్తేనే గుండె జల్లుమంటుంది. అలాగే మలుపుల్లో సైతం ప్రమాధాలు సంభవించే అవకాశలు ఉన్నందున విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు ప్రమాధకర ప్రయానాలపై అవగాహనా కల్పించాల్సి ఉంది. ఇలాటి సంఘటనలపై ట్రాఫిక్ సిబ్బంది సైతం కఠినంగా వ్యవహారిస్తే ప్రమాదాలనుంచి కాపాడిన వారవుతారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కళాశాలల రూట్లల్లో బస్సుల రాకపోకలను పెంచితే ఈ సమస్యను పరిష్కరించ వచ్చునని పలువురు కోరుతున్నారు.

## అమరవీరుల కుటుంబసభ్యులను పరామర్శించిన పోర్టు సిఐ సునీల్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పోలీస్ వారోత్సవాల సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పోర్టు పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో గల అమరవీరుల కుటుంబ సబ్యులు ఇళ్లకు పోర్ట్ సిఐ పి.సునీల్ సందర్శించి వారిని పరామర్శించడం జరిగింది.

గంటిమిల్లి సత్యనారాయణ (ఎఆర్‌పిసి-2686) భార్య పాప, కుమార్తె లావణ్య, కుమారులు గంగాధర్, జగన్ కృష్ణలను; కోటపాటి వీర గంగరాజు (ఎఆర్‌పిసి-273) భార్య వెంకట రామలక్ష్మి, కుమార్తెలు వనితా దేవి, జయశ్రీ లను; దేవరాజు (ఎఆర్‌పిసి-375) భార్య దొంతమ్మ, కుమార్తె పేరు వీరలక్ష్మి, కుమారుడు రాంబాబులను పోర్ట్ సిఐ పి.సునీల్ పరామర్శించారు. వారి యోగక్షేమాలు తెలుసుకుని వారికి ఫలములు ఇచ్చినారు. ప్రభుత్వం తరపున భరోసా అందించారు. అమరవీరుల కుటుంబాలకు ఏసమస్య ఉన్నా పరిస్కరిస్తామని, కుటుంబాల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నాయకంపల్లిలో అగ్నిహెూత్రుని ఆలయ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం

**- శృంగేరి పీఠం ఆంధ్ర, తెలంగాణ ప్రతినిధి బంగారయ్య శర్మ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఆహ్వానం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా నాయకంపల్లి గ్రామంలో నిర్మాణం అవుతున్న అతిపెద్ద అగ్నిహెూత్రుని ఆలయ శంకుస్థాపన నవంబర్ 26వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ శంకుస్థాపనకు శృంగేరి పీఠాధిపతులు విచ్చేస్తున్నారని ఈ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆంధ్ర, తెలంగాణ శృంగేరి పీఠం ప్రతినిధి బంగారయ్య శర్మ, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఆహ్వానించారు. అనంతరం గోకవరం ఆటో యూనియన్ అందించిన 88 వేల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి చంద్రబాబుకి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందించారు. అనంతరం జై ద్వారకా పోస్టర్ ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, మాజీ ఎమ్మెల్సీ చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్‌లో వెలగని వీధి దీపాలు



పాలకొల్లు,మేజర్ న్యూస్: పాలకొల్లు మున్సిపల్ పరిధిలో గల మహాత్మా గాంధీ మెయిన్ రోడ్డు నందు పట్టణంలో అనేక చోట్ల వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా బంగారు కొట్లు వద్ద లైట్లు వెలగకపోవడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు, ఇటీవల దొంగతనాలు అనేకం జరగడంతో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ లైట్లు లేకపోవడంతో భయాందోళన గురవుతున్నారు, కమిషనర్ స్పందించి ఎల్ఈడి వీధిలైట్లను వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు వ్యాపారస్తులు కోరుతున్నారు,

## బాల కార్మికుల సమాచారం 94925 55064, 949255 55065, 94925 55066, 94925 55067 నంబర్లకి ఇవ్వండి

**- కమిటి సభ్యులు సమక్షంలో గోడ ప్రతులను ఆవిష్కరణ**
**- బాల కార్మికులను గుర్తించేందుకు పోలీసుల సహకారం**
**- గుర్తించిన బాల కార్మికులకు వైద్య పరీక్షలు ఏర్పాటు**
**- జిల్లా కలెక్టర్ ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** బాల కార్మిక వ్యవస్థ లేకుండా చూడాలని, అందుకోసం క్షేత్ర స్థాయిలో దుర్బలమైన ప్రాంతాల పై మరింతగా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్, టాస్క్ ఫోర్స్ కమిటి చైర్మన్ పి ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలక్టర్ ఛాంబర్ లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటి చైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ఆర్థిక, సామాజిక నేపథ్యం కారణంగా సమాజంలో నేడు బాల కార్మిక వ్యవస్థ అంతర్లీనంగా ఉందని, బాల కార్మికులు లేకుండా చూడడంలో మరింత జాగృతితో కమిటి సభ్యులు పనితీరు చూపాల్సి ఉందన్నారు. ప్రజలను ఆమేరకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాజంలో ఎంత జాగృతి తో కూడిన కార్యక్రమాలు నిర్వహించినా ఇంకా బాల కార్మిక వ్యవస్థ ఉందన్నారు. ప్రధాన కూడళ్ళలో బిక్షటన, చేపల చెరువులు, హెూటల్స్, జాతీయ రహదారి లోని డాబాలు, కంపెనీల్లో, మెకానిక్ షెడ్స్, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో బాల కార్మికులు పని చేస్తున్నట్లు అనేక సందర్భాల్లో గమనించడం జరిగిందన్నారు. అటువంటి చోట్ల బాల కార్మికులు పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో గుర్తించిన దుర్బలమైన ప్రాంతాల్లో సి సి కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, తగిన విజిలెన్స్ చేపట్టాల్సి ఉందన్నారు. బాల కార్మికులును గుర్తించిన సమయంలొ ఆయా రోజుల్లో కమిటీ సభ్యులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పిల్లల రక్షణ కమిటీ అధ్వర్యంలో వైద్య అధికారుల సమక్షంలో వైద్య పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పోలీసుల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ల ఇతర ప్రధాన ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కోసం నిఘా పెట్టడం జరిగిందని, అటువంటి సందర్భాల్లో బాల కార్మికులు ఉండడం తమ దృష్టికి రావడం జరిగిందన్నారు. వాటి వివరాలు పోలీసులు అందచేస్తారని, ఆయా ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు తరచుగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విజిలెన్స్ సాధారణ తనిఖీలా కాకుండా ఫలవంతంగా ఉండాలనీ కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు.

14 ఏళ్లు వయస్సు నిండని బాల కార్మికులు వివిధ పని చేస్తున్నట్లు గానీ భిక్షాటన చేస్తునట్లు గానీ ప్రజల దృష్టికి వొస్తే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని రావాల్సి ఉందనీ జిల్లా కార్మిక శాఖ సహాయ లేబర్ కమిషనర్ బి ఎస్ ఎమ్ వలి తెలిపారు. ఇందుకోసం 94925 55064 , 949255 55065 , 94925 55066 , 94925 55067 నంబర్ల కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యత పాటించడం జరుగుతుందని తెలియ చేశారు. సమన్వయ కర్త, సహాయ కార్మిక కమిషనర్ బి.ఎస్.ఎం.వల్లి, శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ పి. సూర్య ప్రభావతు, డిప్యూటీ కమిషనర్ రమణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా జె..సంధ్య, ఎస్ఎస్ఎ అధికారి డి.ఎస్తేర్ రాణి, జిల్లా ప్రొబేషనరీ అధికారి జె.ప్రసాద్, డిఎల్ఎస్ఎ ప్రతినిధి బి.వీర్రాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కుం.జి.స్వాతి. , ఎస్ ఐ ఎల్.కనక రాజు, సహాయ కార్మిక అధికారులు ఇతర కమిటి సభ్యులు ఉన్నారు.

# నాలుగు నెలల్లోనే సంక్షేమం అందించాం




**- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ఎస్ఎన్ వర్మ**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే సంక్షేమం అందించామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేసారని, పెన్షనర్లకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 4వేలు అందిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఒకటో తేదిన జీతాలు చెల్లిస్తున్నారని, దీపావళి రోజున దీపం పథకం ద్వారా మహిళలకు గ్యాస్ సిలండర్స్ ఉచితంగా అందిస్తారన్నారు. అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందని, విజయవాడ వరద భాదితులను ఆదుకున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు హామీ మేరకు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి ప్రజలు ఆస్తులకు రక్షణ కల్పించారని, కేంద్రం నుండి అమరావతికి రూ.15వేల కోట్లు సాధించారని, పోలవరం నిర్మాణానికి రూ. 12500 కోట్లు కేంద్రం అనుమతులు పొందడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల కాలంలోనే ప్రజా సంక్షేమం అందించామని, గ్రామ సభలో తీర్మానాలు ద్వారా రోడ్లు అభివృద్ధికి శ్రీకారం చుట్టి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కార్యక్రమాలు చక్కగా చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. 100 రోజుల్లోనే 100కు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలతో జేజేలు అందుకున్నామని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతకు ద్రోహం చేశారని, రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారని విమర్శించారు. మహిళల గురించి రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు గత ప్రభుత్వ వైసిపి నాయకులు గోరంట్ల మాధవ్ కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి సూర్యప్రకాష్, మడికి ప్రసాద్, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, సకుమళ్ళ నాగబాబు, కోరుప్రోలు శ్రీను, నుతాటి ప్రకాష్, కర్నాసుల రాజా, ఎర్రంశెట్టి శ్రీను, వరద సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం

**- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన "పిల్లి" దంపతులు**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి తమ నివాసంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడు దూడ దుర్గారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావు పేట లైట్‌హౌస్ ప్రాంతానికి చెందిన దూడ దుర్గారావు కి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.77,470 లు మంజూరైంది. అందుకు సంబందించిన చెక్కును కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నిధులు లేకపోయినా ఆపదలో ఉన్న ఏ ఒక్క కుటుంబం బాధ పడకూడదన్న సదుద్దేశంతో తమ విజ్ఞప్తి మేరకు బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారాల కోసం దరఖాస్తులు

**ఏలూరు,మేజర్‌న్యూస్:**మౌలానాఅబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డైరెక్టర్ ఉర్దూ అకాడమీ,విజయవాడ వారు కోరి ఉన్నారు. కావున ఉర్దూ సాహిత్య వేత్తలు, స్కాలర్లు, కవులు, పాత్రికేయులు,పరిశోధన తదితర రంగాలలో సేవలు అందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు

ఉర్దూ భాషఅభివృద్ధికి కృషి చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు, ఉర్దూలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారాలు అందచేయుచున్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కొరియున్నారు. వీరికి నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం జయంతి రోజున అవార్డు ప్రధానము చేయుదుమని తెలియజేశారు. అర్హత కలిగిన వారు డైరెక్టర్ ఉర్దూ అకాడమీ, విజయవాడ వారికి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎన్ఎస్ కృపావనం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉమ్మడి పశ్చిమగోదావరి ఎఈవోగా ఏపూరి వానిల

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని ద్వారకాతిరుమల సచివాలయం 2లో వి ఏ ఓగా విధులు నిర్వహిస్తున్న ఏపూరి వానిలకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో ఏఈవోగా పదోన్నతి లభిం చింది.జిల్లా స్థాయిలో 30 మందికి పదోన్నతి కల్పించారు.

పదోన్నతి సాధించిన వనిలకు గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ,మండల స్థాయి నాయకులు అధికారులు,వారి కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.